# సరిపోయిన జంట

"విశ్వామిత్ర"

అనుకోకుండా అర్జంటుగా బెజవాడ వెళ్ల వలసి వచ్చింది. పన్నెండు గంటల బండికి టైం అయిపోవటంవల్ల తప్పనిసరిగా మూడున్నర గంటల బండిని ఆశ్రయించాను. అందులో ఒక్క మూడో తరగతిమాత్రమే వుంటుందని తెలిసినా వెళ్ళక తప్పలేదు. ఈ రైలులో ఎక్కువ తక్కువలు పాటింపబడకపోయినా కాస్త పెద్దమనిషి తరహాగా కనిపిస్తే ఒక రకం మనుషులు గౌరవించకపోరు అనే దృఢనమ్మకంతో అదే రైలులో ప్రయాణం చేయటానికి సాహసించాను.

వేసుకున్న ఇస్త్రీ గుడ్డల 'పర్వస్' వాటితో పాటు నలిగిపోయింది. ఐనా ఆఖరికి ఎలాగో కుస్తీపట్టి లోపలికి ప్రవేశించాను. రెండు మూడు స్టేషన్లు దాటిపోయినై. తర్వాత స్టేషన్లో దిగిపోయే ఒకాయన సీటుని రిజర్వు చేసుకొనేటప్పటికి సగం ప్రాణం చచ్చింది. చేతి సంచిని యెక్కడ పెడదామన్నా యెవరి కాళ్లో చేతులో దానికి ఏమాత్రం తగిలినట్టుగా వున్నా దాని బరువునంతా అతనే మోస్తున్నట్టుగా భావించి, ఆ సంచిని తీసి అవతల పారేయటంతో వూరుకోక "బెజవాడ" దాటిం తర్వాత కూడా సాధిస్తూనే వుంటాడనే భయంతో చేతి సంచిని చేతిలోనే వుంచుకుని నిలబడ్డాను.

కాసేపయింతర్వాత కూర్చున్నానన్నమాటే గాని సౌఖ్యంలేదు. స్టేషన్ వస్తోందనగానే పక్కవాడిమీద పడకుండా వుండటానికి, చేతికి ఏదైనా ఆధారం చూసుకోవటం ప్రతి స్టేషన్‌కీ ఒక గండంగా పరిణమించగా, ఎదురుగా చూడటానికికూడా నోచుకోకుండా, ఎదురుగా ఒకజంట సరసాలాడుకోవటం మొదలెట్టారు.

ఒక స్టేషన్లో అప్పుడే పెట్టెలో ప్రవేశించిన దంపతులు స్థలంకోసం వెతుక్కొంటున్నారు. ఆమె చంటి పిల్లాణ్ణికూడా ఎత్తుకుని వుంది. ఆమె ముఖంలో ఏభావం కనిపించటం లేదు గాని ఆమె హృదయంలో చాలా భావాలు దాక్కొని వుంటయ్యని ఊహించాను. అతని ముఖంలో సంతోషం గాని, విచారం గాని వున్నయని చెప్పలేం కాని అతని హృదయంలో భావాలు గూడు కట్టుకున్నట్టుగా చూడగానే అనిపించలేదు.

అసలు ఇంతకీ వాళ్ళ మొఖాలు పరీక్ష చేయటానికి కారణం వుంది. అది అతని ముఖంలోని ఒక అంగవైకల్యమే. అంటే అతని పై పెదవి, ముక్కు కలిసిపోయినయ్. ఆ భాగంలో ఒక తొర్ర, భయంకరంగా కొన్ని పళ్ళు బైటికి నెట్టుకురావటం చూస్తే ప్రతి వాడికీ, అతనితో వున్న ఆ భార్య అతనితో ఎలా కాపరం చేస్తోందా అనిపించక మానదు.

ఆమె యావజ్జీవిత విచారానికితోడు రైల్లో స్థలం దొరక్కపోవటంకూడా ఓ కష్టంగా కలిసి రావటం సహించలేక నేను నా స్థలంనుంచి లేచి ఎదురుగా ఇద్దరు స్త్రీల మధ్య కూర్చుని కులుకుతున్న పెద్దమనిషిని నాసీటులో కూర్చోపెట్టి, ఇందాక అతను కూర్చున్న స్థలంలో ఆమెని కూర్చోమన్నాను. ఈవిషయంలో నేను లేవమన్న వ్యక్తి నా మీద కొంచెం కోపంగా చూచినా, అంతవరకు తను కూర్చొని పవిత్రం చేసిన ఆ సీటులో ప్రస్తుతం ఒక అందమైన ఆడపిల్ల కూర్చోవటంవల్ల శాంతించి, అతను చేశాననుకుంటున్న త్యాగానికి లోపల్లోపల ఎంతో సంతోషిస్తున్నట్టుగా కొన్ని చిన్న పనుల ద్వారా తెలియ చేసుకొని ఆనందించాడు. ఆమె నా వంక కృతజ్ఞతగా చూసి, నేను నుల్చొని వుండటం సహించలేనట్టుగా మొఖంలో భావాల ద్వారా తెలియ చేసింది.

వాళ్ల దుస్తుల్ని బట్టి చూస్తే గొప్పవాళ్లు కాదని స్పష్టంగా తెలుస్తోంది. కాని మర్యా

దగా ప్రవర్తించటం బట్టి వాళ్ళ పరిస్థితుల్ని అర్థం చేసుకోగలిగిన నేను ఆమె విషయంలో పూర్తిగా సానుభూతి చూపించాను.

నేను చూసిన దగ్గిర్నుంచీ ఆమె యింత వరకూ మాట్లాడక పోవటం, ఆమెమీద, నా సదభిప్రాయాన్ని బలపరిచింది.

అతను చెప్పిన మాటల్ని బట్టి అతనికి చిన్నప్పుడెప్పుడో పై పెదవిమీద వ్రణం లేచిన కారణంగా, ముక్కూ నోరూ ఏకమైనట్టు తెలిసింది.

ఆమెమీది సానుభూతిని అతని ఈమాటలు మరింత గట్టిచేసినై. ఎందుకంటే- అతనికి ముక్కూ నోరూ ఏకమైన తర్వాతే ఆమె అతన్ని పెళ్ళి చేసుకోవటం తటస్థించిందన్న మాట. అంటే అటువంటివాళ్లని పెళ్లి చేసుకోవటానికి ఏ "వనితా" ఒప్పుకోదు. అలాంటప్పుడు ఇంత అందమైన స్త్రీ ఒప్పుకొన్నదంటే- దానికి కారణం ఆమె దరిద్రమే అని చెప్పటానికి సాక్ష్యంగా వాళ్ల ప్రతి వస్తువూ కనిపిస్తూనే వుంది.

ఇటువంటి భర్తతో ఆమె ఎలా కాపురం చేస్తూందో అని, అతనికి అటువంటి భార్య దొరకటం అతని అదృష్టమే అని తీర్మానించుకున్నట్టు ఆ పెట్టెలోని ప్రతివారి ముఖం చెప్తూనే వుంది.

ఆమెని చూస్తున్నకొద్దీ నా మనసులో ఆలోచనలు దొర్లటం ఎక్కువైనయ్. వెధవ డబ్బు! డబ్బు లేకపోవటం వల్లనే గదా! ఆమె యితన్ని వివాహం చేసుకోవటం తటస్థించటం! డబ్బు లేకుండా, పరోక్షంగా డబ్బు చేయించే యిటువంటి ఘోరకృత్యాలు ఎన్నో నాముందు ఆ క్షణంలో నృత్యం చేసినై. ఆమె విషాదమయ జీవితాన్ని గురించీ, అతని ఆనందం కోసం ఆమెని అతను ఎలా హింసిస్తున్నాడో అని, నాలో నేను తలుచుకొని కుళ్ళిపోయాను. ఇది కారణంగా అతనిమీద నాకు కోపం, ఆమె మీద జాలీ, దయా అపరిమితంగా పుట్టినై.

రైలు బెజవాడని చేరుకొంటోంది. ఆ అమ్మాయి సామాను సర్దక పోవటం చూసి ఆమె పక్కన కూచున్న ఇద్దరు ఆడవాళ్ళూ "ఎక్కడి దాకా వెడుతున్నారు?" అని అడిగారు.

ఆ అమ్మాయి వెంటనే చెప్పక, టిక్కెట్ తీసి చూపించింది. వాళ్లు ఆశ్చర్యంగా ఆమె వంక చూసి "ఏలూరా?" అన్నారు.

ఔనన్నట్లు తలూపింది.

చేతులో టిక్కెట్ కనబడుతూ వున్నా, "ఎక్కడిదాకా?" అని నన్నడిగిన ప్రతివాళ్లకీ నేను వెళ్లే వూరు నోటితో చెప్పి, ఆ అడిగిన వాళ్లు ఏఏ వూళ్లు వెడుతున్నారో తెలుసుకోకుండా వొదిలి పెట్టని నాకు ఆ అమ్మాయి చర్య ఆశ్చర్యంగానే తోచింది.

అయినా ఏవో డబ్బులు తీసుకుంటూ దాంతో పాటు టిక్కెట్ తీసుకున్న ఆమె నోటితో చెప్పక, టికెట్ చూపించడంలో, ఆమె మౌనం న్యాయంగానే తోచింది నాకు.

రైలు ప్లాట్‌ఫారంమీద ఆగింది. జనం హడావుడిగా దిగుతున్నారు. జనం ఎక్కువగా వుండటంవల్ల దిగటం కొంచెం కష్టంగా వుండటంవల్ల, గంటసేపాగుతుంది గదా తొందరేంలే మెల్లిగా దిగుదామని వెనుక నుంచున్నాను సంచి చేత్తో పట్టుకొని.

ఆమె పెట్టెలో యెవరివంకో చూస్తూండగా బిస్కట్లు అమ్మే అతను మా పెట్టె దాటి పోయాడు. ఓ గట్టి కేకతో అతన్ని కేకేసి ఆ అమ్మాయి భర్తని వుద్దేశించి చిల్లర చేతికిచ్చింది. భర్తతో ఏవో కొన్ని మాటలు మాట్లాడిందిగాని నాకేం అర్థంకాలే.

పెట్టెలో చాలా భాగం ఖాళీ అయిపోవడంతో, ఆమె ధైర్యంగా ఇంకా గట్టిగా భర్తతో ఏదో మాట్లాడింది. ఈసారీ నా కర్థంకాక అతన్ని మెల్లిగా అడిగాను. అతను చెప్పిన మాటల్ని వినగానే, ఒక్కసారిగా నే నూహించుకున్న భావాలకి వేళ్లు తెగిపోవటంతో నా మెదడు కదలబారి కళ్లు మసకలు కమ్మటంవల్ల జేబు రుమాలుతో తుడుచుకొని తేలిక గుండెతో రైలు దిగాను.

ఆమె మూగజీవి.